VEGA
JEWELLERS
దివిలోనైనా... భువిలోనైనా.. వేగ తోడుంటే
వివాహం వైభోగం అవుతుంది.
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | USA
follow us vegajewellers

RNI NO : APTEL/2016/69464

# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 54

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

శుక్రవారం 24 జూలై 2026





పార్లమెంట్ వర్షాకాల సమావేశాల సందర్భంగా తెలుగుదేశం పార్టీకి చెందిన నూతన ఎంపీలు సానా సతీష్, భాష్యం రామకృష్ణ, చింతకాయల విజయ్ సెషన్ విరామ సమయంలో గురువారం భారత ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్‌తో భేటీ అయ్యారు. ఉపరాష్ట్రపతి నూతనంగా పార్లమెంట్‌లో అడుగుపెట్టిన ఎంపీలకు ఆయన ఈ సందర్భంగా పలు సూచనలు చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

–న్యూఢిల్లీ కలంకౌంటర్ :

## మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని కలిసిన అంతర్జాతీయ విలువిద్య క్రీడాకారిణి జ్యోతి సురేఖ వెన్నం



**అమరావతి,కలంకౌంటర్ :** సచివాలయంలో తన చాంబర్‌లో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ని అంతర్జాతీయ విలువిద్య క్రీడాకారిణి జ్యోతి సురేఖ వెన్నం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తాను ఇటీవల సాధించిన వరల్డ్ కప్ లో సాధించిన పతకాల విశేషాలను మంత్రికి వివరించారు. ఆమె వెంట తండ్రి కూడా పాల్గొన్నారు. జ్యోతి సురేఖ వెన్నం సాధించిన విజయాలను మంత్రి అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ స్థాయి విజయాలు సాధించి యువతకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. క్రీడాకారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

## బంటుమిల్లిలో నాలుగో రోజు డాక్యుమెంట్ రైటర్స్ పెన్డౌన్ కార్యక్రమం



**బంటుమిల్లి,కలంకౌంటర్ :** డాక్యుమెంట్ రైటర్ల జీవన భృతికి విఘాతం కల్పిస్తూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 396 ను రద్దు చేయాలని నిలిపి చేయాలని రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రైవేటీకరణ ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ డాక్యుమెంటరీ అసోసియేషన్ ఇచ్చిన పిలుపుమేరకు జరుగుతున్న పెన్డౌన్ ఆందోళన కార్యక్రమం బంటుమిల్లిలో గురువారం నాలుగో రోజు చేరుకుంది.

## కందుకూరులో కార్డెన్ అండ్ సెర్చ్





**కందుకూరు, కలంకౌంటర్ :** ప్రకాశం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు, కందుకూరు సబ్ డివిజన్ ఆఫీసర్ బాలసుబ్రమణ్యం ఆదేశాల మేరకు కందుకూరు పట్టణం నందు గల ప్రశాంతి నగర్ లో గురువారం ఉదయం కందుకూరు సబ్ డివిజనల్ పోలీస్ అధికారులు, స్టాఫ్ ద్వారా కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ కార్డెన్ సెర్చ్ లో ప్రశాంతి నగర్ లో ఉన్న ప్రతి ఇంటిని తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని బైకులను స్వాధీన పరుచుకున్నారు. ప్రశాంతి నగర్ వాసులతో మాదకద్రవ్యాల వినియోగం గూర్చి వారికి వివరించి వారిచే, డ్రగ్స్ వాడటం ఆరోగ్యానికి సమాజానికి హానికరమని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కందుకూరు సిఐ షేక్ అన్వర్ భాష, గుడ్లూరు సీఐ రమేష్, డివిజన్లోని అందరూ ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

# ల్యాండ్ లిటిగేషన్ ఫ్రీ రాష్ట్రంగా ఏపీ

- భూ సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి
- భూ రికార్డులకు శాశ్వత భద్రత కల్పించేలా మీ భూమి-బ్లాక్ చెయిన్
- ట్యాంపర్ చేయలేని విధంగా ల్యాండ్ రికార్డులకు హై సెక్యూర్టీ
- మీ భూమి-బ్లాక్ చెయిన్ పైలెట్ ప్రాజెక్టును ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు





**అమరావతి, కలంకౌంటర్ :** ప్రక్షాళన-విముక్తి-భద్రత అంశాలుగా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ల్యాండ్ లిటిగేషన్ ఫ్రీ రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దేలా కృషి చేస్తున్నామని సీఎం తెలిపారు. దీనికి అనుగుణంగానే భూ రికార్డులకు శాశ్వత భద్రత కల్పించేలా మీ భూమి-బ్లాక్ చెయిన్ ప్రాజెక్టును తెచ్చామని సీఎం చంద్రబాబు చెప్పారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి మీ భూమి-బ్లాక్ చెయిన్ పైలెట్ ప్రాజెక్టును వర్చువల్‌గా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. ఈ మేరకు ఈ ప్రాజెక్టులో ఉన్న ఫీచర్స్, ప్రత్యేకతలను సీఎస్ సాయి ప్రసాద్, రెవెన్యూ శాఖ అధికారులు సీఎం చంద్రబాబుకు వివరించారు. భూ రికార్డులకు శాశ్వత భద్రత కల్పించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనల మేరకు బ్లాక్‌చెయిన్ విధానాన్ని రెవెన్యూ శాఖ రూపొందించినట్టు తెలిపారు. భవిష్యత్తులో భూ సమస్యలకు చెక్ పెట్టేలా... ప్రతీ ల్యాండ్ పార్సెల్‌కు ప్రత్యేక డిజిటల్ ఐడీ ఇచ్చి ట్యాంపర్-ప్రూఫ్, సెక్యూరిటీతో లావాదేవీలు జరిగేలా బ్లాక్ చెయిన్ వ్యవస్థను తీర్చిదిద్దినట్టు వెల్లడించారు. ఇక భూ సమస్యలు ఉత్పన్నం కావడానికి డబుల్ రిజిస్ట్రేషన్లు ప్రధాన కారణంగా ఉన్నాయని... ఇకపై డబుల్ రిజిస్ట్రేషన్ సమస్యలను నివారించేలా బ్లాక్ చెయిన్ విధానం పని చేస్తోందని అధికారులు వివరించారు. భూ రికార్డులకు సింగిల్ సోర్స్ ఆఫ్ ట్రూత్‌గా ఉండేలా మీ భూమి-బ్లాక్ చెయిన్ ప్రాజెక్టును అందుబాటులోకి తెచ్చామని... రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ల శాఖలను ఒకే వేదిక మీదకు తెచ్చేలా ప్రాజెక్ట్ డిజైన్ చేశామని తెలిపారు. NIC ఆంధ్రప్రదేశ్, NIC బెంగళూరు లోని సెంటరాఫ్ ఎక్స్ లైన్స్ ఇన్ బ్లాక్ చెయిన్ టెక్నాలజీ సంస్థలు సంయుక్తంగా హైపర్ లెడ్జర్ ఫ్యాబ్రిక్ టెక్నాలజీతో మీ భూమి-బ్లాక్ చెయిన్ వ్యవస్థను అభివృద్ధి చేసినట్టు అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఈ ప్రాజెక్టును కర్నూలు, చిత్తూరు, బాపట్ల, కృష్ణా, తూర్పు గోదావరి, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లోని ఒక్కో మండలంలో అమలు చేస్తున్నట్టు తెలిపారు. దీంట్లో భాగంగా ఆస్పరి, పెనుమూరు, రేపల్లె, గన్నవరం, కడియం, గుమ్మలక్ష్మీపురం, కొత్తవలస మండలాల పరిధిలోని 89 రీ-సర్వే గ్రామాల్లోని 1,37,763 ల్యాండ్ పార్సెల్ మ్యాప్‌లు కవర్ చేసేలా మీ భూమి-బ్లాక్ చెయిన్ పైలట్ ప్రాజెక్ట్ అమలు చేయనున్నట్టు వివరించారు. మీ భూమి-బ్లాక్ చెయిన్ అమలు జరిగే తీరును వివరించే వీడియోను అధికారులు ప్రజెంట్ చేశారు. ఇదే విధానంలో క్యూ ఆర్ కోడ్, ఆధార్ ను అనుసంధానించేలా చూడాలని ముఖ్యమంత్రి సూచించారు.

**అధ్యయనం చేయాలి... లోపాలు సరిదిద్దాలి..** మీ భూమి-బ్లాక్ చెయిన్ పైలెట్ ప్రాజెక్టు ప్రారంభించిన సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..."భూ రికార్డులు సరిగా లేకపోవడం వల్ల విలువైన భూముల విషయంలో మోసాలు జరుగుతున్నాయి. తెలంగాణతో పోల్చుకుంటే ఏపీలో ల్యాండ్ లిటిగేషన్లు తక్కువే. కానీ గత ప్రభుత్వ విధానం వల్ల ఏపీలోనూ భూ తగాదాలు... వివాదాలు పెరిగాయి. 22ఏ పేరుతో కక్ష సాధింపులకు పాల్పడ్డారు. ప్రక్షాళన, విముక్తి, భద్రత వంటి అంశాలపై దృష్టి సారించి భూ సమస్యలను పరిష్కరిస్తున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా సర్వేలు చేపడుతున్నాం.. రికార్డులను ప్రక్షాళన చేస్తున్నాం... పట్టాదార్ పాస్ పుస్తకాలు రాజముద్ర వేసి ఇస్తున్నాం. శెట్టిపల్లి, వట్టిచెరుకూరు, కంగుంది, గుటుపల్లి వంటి గ్రామాల్లో దశాబ్దాలుగా వివాదంలో ఉన్న భూములకు విముక్తి కల్పించాం. ఇప్పుడు ప్రారంభించిన మీ భూమి-బ్లాక్ చెయిన్ ప్రాజెక్టు ద్వారా భూములకు శాశ్వత భద్రత దక్కుతుంది. భూ రికార్డులకు సంబంధించి ట్యాంపర్ ప్రూఫ్ వ్యవస్థను తెస్తున్నాం.. పటిష్టమైన భద్రత కల్పిస్తున్నాం. బ్లాక్ చెయిన్ ద్వారా రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలు ఒకే వేదిక మీదకు వస్తాయి... ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్రయ విక్రయాలు చేసుకోవచ్చు. రెండు నెలల పాటు ఈ పైలెట్ ప్రాజెక్టు అమలును పూర్తి స్థాయిలో అధ్యయనం చేయాలి. ఈ వ్యవస్థ అమల్లో ఏమైనా లోటుపాట్లు ఉంటే వాటిని నమోదు చేసుకోవడానికి ఓ కంప్లైంట్ సెల్ పెట్టాలి... దానికి అనుగుణంగా బ్లాక్ చెయిన్ ప్రాజెక్టులో మార్పులు చేర్పులు చేసుకోవచ్చు. ఇప్పటి నుంచి సర్వే పూర్తి అయిన గ్రామాలు బ్లాక్ చెయిన్ టెక్నాలజీ వ్యవస్థలోకి వెళ్తాయి. నవంబర్ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా మీ భూమి-బ్లాక్ చెయిన్ టెక్నాలజీ వ్యవస్థ అందుబాటులోకి వచ్చేలా చూడాలి. భూ సమస్యలకు ఫుల్ స్టాప్ పెట్టేలా రెవెన్యూ వ్యవస్థను తీర్చిదిద్దుతున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ సమస్యలకు పరిష్కారం చూపాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. భూ సమస్యలకు పరిష్కారం చూపితే ఫిర్యాదుల సంఖ్య గణనీయంగా తగ్గుతుంది."అని ముఖ్యమంత్రి చెప్పారు. మంత్రి అనగాని సత్య ప్రసాద్, సీఎస్ సాయి ప్రసాద్, రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు, ఏడు జిల్లాల కలెక్టర్లు, ఏపీ-ఎన్ఐసీ, బెంగళూరు-ఎన్ఐసీ ప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

# ఏపీ పోలీస్ రిట్రీట్ 2026-ఫ్యూచర్ పోలీసింగ్ కాన్ఫరెన్సుకు హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు





**విజయవాడ,కలంకౌంటర్ :** భవిష్యత్తులో పోలీసులకు ఎదురయ్యే సవాళ్లు.. వాటిని ఏ విధంగా అధిగమించాలనే అంశాలపై రెండు రోజుల నుంచి పోలీస్ ఉన్నతాధికారుల మేథో మధనం. మూడు రోజుల పాటు జరిగిన ఫ్యూచర్ పోలీసింగ్ కాన్ఫరెన్సులో పాల్గొన్న రాష్ట్రంలోని ఐపీఎస్ అధికారులు. టెక్నాలజీని వినియోగించి పోలీసింగ్ ఏ విధంగా చేపట్టాలి... మహిళలపై నేరాలను అదుపు చేయడం... సైబర్ నేరాల కట్టడికి తీసుకోవాల్సిన చర్యలపై కాన్ఫరెన్సులో చర్చ. వివిధ అంశాలపై తాము రూపొందించిన ప్రజెంటేషన్లను సీఎం చంద్రబాబుకు వివరించిన ఐపీఎస్ అధికారులు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... 2001లో ఇదే తరహాలో ఫ్యూచర్ పోలీసింగ్ తరహాలో వర్క్ షాప్ నిర్వహించాం. గతంతో పోల్చుకుంటే నేరాల తీరు మారింది. సోషల్ మీడియా వేదికగా సమాజంలో అశాంతిని రెచ్చగొట్టేలా కొందరు వ్యవహరిస్తున్నారు. నేరాలను కట్టడి చేయడంతోపాటు.. తప్పులు చేసిన వారికి శిక్షలు పడేలా చేయగలిగితే నేరాలు అదుపులోకి వస్తాయి. మారుతున్న కాలానికి అనుగుణంగా పోలీస్ వ్యవస్థను రీ-స్ట్రక్చర్ చేయాల్సిన అవసరం ఏ మేరకు ఉందో పరిశీలించాలి. ఇన్విజిబుల్ పోలీస్... విజిబుల్ పోలీసింగ్ తరహా విధానానికి ప్రయార్టీ ఇవ్వాలి. టెక్నాలజీని వినియోగించడం ద్వారా చాలా తక్కువ మందితో ఆపరేషన్ సింధూర్ ను సక్సెస్ చేశారు. శాంతి భద్రతలను అదుపు చేయడం... నేరాలను కట్టడి చేయడంలో ప్రణాళికలు రచించడంతో పాటు ఫలితాలు చూపగలగాలి.



పోలీసులు ప్రజలతో ఫ్రెండ్లీగా ఉండాలి... నేరస్థుల పట్ల కఠినంగా వ్యవహరించాలి. తిరుమల మెట్ల దారిలో అపహరణకు గురైన ఆంజనేయ స్వామి విగ్రహాన్ని టెక్నాలజీ వల్ల చాలా తక్కువ సమయంలో ట్రేస్ చేయగలిగారు. అపహరించిన వ్యక్తి మానసిక వికలాంగుడు కావచ్చు... కానీ సరైన చర్యలు తీసుకోకుంటే ప్రజలు అపోహపడతారు. ఇలాంటి సంఘటనల్లో సరైన చర్యలు తీసుకోకుంటే ప్రభుత్వానికి చెడ్డ పేరు ఉంటుంది. ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టేందుకు కొన్ని పార్టీలు ఏకంగా నేరాలు చేయడానికి కూడా వెనుకాడడం లేదు. పాస్టర్ ప్రవీణ్ ఘటనలో చేసిన దుష్ప్రచారాన్ని తిప్పికొట్టడానికి నాలుగైదు రోజులు పట్టింది. గంజాయిని చాలా వరకు కంట్రోల్ చేశాం... కానీ ఇంకా కట్టడ చేయాలి. గంజాయి వల్ల కుటుంబాలకు కుటుంబాలే నాశననమవుతున్నాయి. గంజాయి మత్తులో జరిగే నేరాలను కట్టడి చేయాలి. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. డాగ్ స్క్వాడ్, ఫోరెన్సిక్ విభాగాలను మరింత బలోపేతం చేయాలి. రౌడీయిజాన్ని, ఫ్యాక్షనిజాన్ని కంట్రోల్ చేశాం. పోలీసుల్లో, ప్రజల్లో నైతిక స్థైర్యాన్ని పెంపొందించేందుకు స్వయంగా నేనే స్పాట్ కు వెళ్లిన సందర్భాలు ఉన్నాయి. పోలీస్ వర్క్ ఫోర్స్ ను రీ-ఓరియేంటేషన్ చేయాలి. పోలీసులకు డిజిటల్ లిటరసీ అనేది ఉండి తీరాల్సిన రోజులివి. పోలీసింగ్ లో ఏఐను అడాప్ట్ చేసుకోవాల్సిన అవసరం ఉంది. అవసరమైన మేరకు పోలీసులకు సర్టిఫికేషన్ కోర్సులు ప్రవేశపెట్టాలి. వివిధ రకాల నేరాలను కట్టడి చేసే విషయంలో నైపుణ్యం పెంచేలా శిక్షణ ఇవ్వాలి. ముఖ్యంగా సోషల్ మీడియా, సైబర్ నేరాలు, గంజాయి-డ్రగ్స్, మహిళలపై నేరాల కట్టడి, నేరాలకు శిక్ష పడేలా తీసుకోవాల్సిన చర్యలు వంటి అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి. ఏపీఎస్పీ ద్వారా శిక్షణ పొందుతున్న వారిని డిప్యూటేషన్ మీద జిల్లాలకు పంపే అంశాన్ని పరిశీలించాలి. పోలీసు ఉన్నతాధికారులు కూడా ఆయా రంగాల్లోని ప్రొఫెసర్లు, నిపుణులతో మాట్లాడుతూ ఉండాలి. టెక్నాలజీ సహా వివిధ రంగాల్లో కొత్త విధానాలను తెలుసుకోవాలి. నేరాలను కట్టడి చేస్తూనే... నేరాలు చేయడానికి అలవాటు పడ్డ వారిని కంట్రోల్ చేసేలా చర్యలు తీసుకోవాలి. హెడ్ కానిస్టేబుల్, ఏఎస్ఐ హోదాల్లో ఉన్న వారి సేవలను కూడా పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలి.

# రెండేళ్లలో రాష్ట్రానికి రూ.29.30లక్షల కోట్ల పెట్టుబడులతో పరిశ్రమల రాక


- స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ చిత్తశుద్ధితో అమలు చేయాలి
- పరిశ్రమల గ్రౌండింగ్‌లో ప్రతినెలా పురోగతి కన్పించాలి
- 20లక్షల ఉద్యోగాల కల్పనపై మంత్రుల బృంద సమావేశంలో మంత్రి లోకేష్ దిశానిర్దేశం





**అమరావతి,కలంకౌంటర్ :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకు రూ.29,30,357 కోట్ల పెట్టుబడులతో 1037 పరిశ్రమలు ముందుకు వచ్చాయి. వీటిద్వారా 24,66,165 మంది యువతకు ఉద్యోగావకాశాలు లభించే అవకాశం ఉంది. ప్రతి ప్రాజెక్టును ఎప్పటికప్పుడు ట్రాక్ చేస్తూ త్వరితగతిన గ్రౌండ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. యువతకు 20లక్షల ఉద్యోగాల కల్పనపై ఏర్పాటైన మంత్రుల బృందం సమావేశం మంత్రి లోకేష్ అధ్యక్షతన ఉండవల్లిలో జరిగింది. సమావేశంలో లోకేష్ మాట్లాడుతూ... పరిశ్రమలకు భూకేటాయింపులు, అనుమతులు, ప్రోత్సాహకాల విషయంలో వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ప్రతినెలా నిర్వహించే సమీక్షలో పురోగతి కన్పించాలని అన్నారు. జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామిక సంస్థలు ఏపీని ఎంచుకోవడానికి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానమే ప్రధాన కారణం. దీనిని ప్రతి అధికారి చిత్తశుద్ధితో అమలు చేయాలని ఆదేశించారు. నవంబర్ లో విశాఖపట్నంలో నిర్వహించే పార్ట్నర్ షిప్ సమ్మిట్ లో మరిన్ని పరిశ్రమలు రాష్ట్రానికి వచ్చే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలో కొత్తగా వచ్చే పరిశ్రమలకు పెద్దఎత్తున పునరుత్పాదక ఇంధనం అవసరం, రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టులను వేగంగా పూర్తిచేయాలని కోరారు. నిర్ణీత సమయంలో గ్రౌండ్ చేసిన ఎంఎస్ఎంఇలకు ప్రోత్సాహకాలు అందించేలా ఆటోమేటిక్ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. గత రెండేళ్లలో 1,20,897 ఎంఎస్ఎంఇలకు ప్రోత్సాహకాలు అందజేసినట్లు అధికారులు తెలిపారు. యువతకు ఎక్కువ ఉద్యోగావకాశాలు కల్పించే ఎంఎస్ఎంఇ యూనిట్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మంత్రి సూచించారు. ఈ సమావేశంలో మంత్రులు పొంగూరి నారాయణ, కందుల దుర్గేష్, గొట్టిపాటి రవికుమార్, కొండపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## డీఆర్‌డీఓ మరో ఘనత.. 'కుశ' క్షిపణి ప్రయోగం విజయవంతం




**విజయవాడ, కలంకౌంటర్ :** రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) మరో కీలక విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. సుదూర లక్ష్యాలను ఛేదించగల 'కుశ' క్షిపణి (LR-SAM) తొలి ప్రయోగాన్ని గురువారం విజయవంతంగా నిర్వహించింది. ఒడిశా తీరంలోని ఏపీజే అబ్దుల్ కలాం ఐలాండ్ నుంచి ఈ పరీక్షను చేపట్టినట్లు డీఆర్‌డీఓ వర్గాలు వెల్లడించాయి. గగనతలంలో అత్యంత వేగంగా, ఎత్తులో ప్రయాణించే ఎలక్ట్రానిక్ లక్ష్యాన్ని అనుకరించి ఈ పరీక్ష నిర్వహించగా, 'కుశ' క్షిపణి దానిని విజయవంతంగా అడ్డగించిందని డీఆర్‌డీఓ ఒక ప్రకటనలో తెలిపింది. యుద్ధ విమానాలు, క్షిపణులు, మానవరహిత వైమానిక వాహనాలు (UAV), శత్రువులకు చెందిన భారీ విమానాలను కూడా సుదూరంలోనే నాశనం చేయగల సత్తా ఈ క్షిపణి వ్యవస్థకు ఉంది. 'ప్రాజెక్ట్ కుశ'లో భాగంగా భారత వాయుసేన, నౌకాదళం కోసం ఈ క్షిపణి వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న 80 కిలోమీటర్ల రేంజ్ ఎంఆర్-శామ్, 400 కిలోమీటర్ల రేంజ్ ఎస్-400 వ్యవస్థల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని 'కుశ' భర్తీ చేయనుంది. ఇప్పటికే వాయు రక్షణ వ్యవస్థలో ఉన్న బరాక్-8, ఎస్-400, ఆకాశ్ క్షిపణులకు ఇది అదనపు బలంగా నిలవనుంది.

# అమ్మవారికి సారె..







**విజయవాడ,కలంకౌంటర్ :** విజయవాడ అర్బన్ జిల్లా ఆర్య వైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు గర్రె ధనలక్ష్మి ఆధ్వర్యం లో ఇంద్రకీలాద్రిపై వేంచేసి ఉన్న కనకదుర్గ అమ్మవారి కి ఆషాడ మాస సారె అంగరంగ వైభవంగా సమర్పించారు. ఈ కార్యక్రమం లో మహాసభ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు కొప్పురావూరి రజిని తదితరులు పాల్గొన్నారు.

# జాబ్ మేళాలో 244 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపిక





**కావలి,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి సహకారంతో కావలి పట్టణంలోని ఎమ్మెస్సార్ డిగ్రీ కాలేజీలో గురువారం జరిగిన మెగా జాబ్ మేళా కార్యక్రమంలో 244 మంది నిరుద్యోగులు వివిధ ఉద్యోగాలకు ఎంపిక కావడం జరిగింది. ఈ జాబ్ మేళాలో సుమారుగా 34 కంపెనీలు పాల్గొని నిరుద్యోగులకు ఇంటర్వ్యూలో నిర్వహించడం జరిగింది. మొత్తం 788 మంది నిరుద్యోగులు ఈ జాబ్ మేళాలో పాల్గొనగా వీరిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 244 మందిని వివిధ ఉద్యోగాలకు ఎంపిక కావడం జరిగింది. మరో 143 మందికి తదుపరి ఇంటర్వ్యూ కి పంపడం జరుగింది. ఎంపిక కాబడిన నిరుద్యోగులకు ఆయా కంపెనీల ప్రతినిధుల ద్వారా నియామక ఉత్తర్వులు అందించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు ఒకసారి ప్రతి నియోజకవర్గంలో జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని, ఈ సారి ఎమ్మెల్యే కృషితో 10 సాఫ్ట్వేర్ కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొనడం జరిగిందని తెలిపారు. ప్రతి ఒక్కరికీ ఉద్యోగ అవకాశాలు కల్పించడమే తమ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెస్సార్ డిగ్రీ కాలేజీ కరస్పాండెంట్ గుంటుపల్లి రాజ్ కుమార్ చౌదరి, జిల్లా ఎంప్లాయిమెంట్ అండ్ స్కిల్ ఆఫీసర్ ఎం వినయ్ కుమార్, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి షేక్ అబ్దుల్ ఖయ్యూం, యంగ్ ప్రొఫెషనల్ పి4 కావలి సత్యానందం గారు, ఎమ్మెస్సార్ కళాశాల సిబ్బంది, నెల్లూరు జిల్లా నైపుణ్య అభివృద్ధి సిబ్బంది, సిడాప్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ని కలిసిన రెడ్ క్రాస్ సొసైటీ డైరెక్టర్ డా. పాదర్తి





**కావలి, కలంకౌంటర్ :** ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి సహకారంతో నెల్లూరు జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ డైరెక్టర్గా డా. పాదర్తి నాగరాజు నియమితులైన సందర్భంగా గురువారం ఆయన తన మిత్రబృందంతో కలిసి ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డా. పాదర్తి నాగరాజుతో పాటు ఆర్యవైశ్య సంఘానికి చెందిన ప్రముఖులు, పెద్దలు, యువ నాయకులు కలిసి ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. డా. పాదర్తి నాగరాజు మాట్లాడుతూ..... తనపై నమ్మకం ఉంచి నెల్లూరు జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ డైరెక్టర్గా బాధ్యతలు నిర్వహించే అవకాశం కల్పించేందుకు సహకరించిన ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.. అనంతరం డా. పాదర్తి నాగరాజును ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.

# పాలాభిషేకం



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** తల్లికి వందనం పథకం ద్వారా విద్యార్థులకు చేయూత ఇస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం 45 వ డివిజన్ ఇంచార్జి,బ్రాహ్మణ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ పీవీ ఫణికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించగా,అతిథిగా హాజరైన టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్.

# సమన్వయం తోనే సాధ్యం - కర్లపాటి




**జగ్గయ్యపేట,కలంకౌంటర్ :** పాఠశాల విద్యాశాఖ మరియు సమగ్ర శిక్షా సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించనున్న తల్లిదండ్రుల మరియు ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాన్ని తల్లిదండ్రులందరూ పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని యన్ టి ఆర్ జిల్లా ఫుడ్ విజిలెన్స్ కమిటీ సభ్యులు, జగ్గయ్యపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కో-ఆప్షన్ సభ్యులు కర్లపాటి వెంకట శ్రీనివాసరావు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల సమగ్ర వికాసం కేవలం ఉపాధ్యాయుల బాధ్యతే కాకుండా తల్లిదండ్రుల పర్యవేక్షణపై కూడా ఆధారపడి ఉంటుందన్నారు. ప్రతిరోజూ పిల్లలను క్రమం తప్పకుండా, పరిశుభ్రమైన పూర్తి యూనిఫాంతో పాఠశాలకు పంపడమే కాకుండా, వారి హాజరు, విద్యా పురోగతిని క్రమం తప్పకుండా పరిశీలించుకోవాలన్నారు. టైమ్‌టేబుల్‌కు అనుగుణంగా స్కూల్ బ్యాగ్‌ను సర్దడం, ఇచ్చిన గృహకార్యాన్ని హోంవర్క్ పూర్తి చేయించడం వంటి విషయాల్లో ఇంట్లో తగిన సహకారాన్ని అందించాలని సూచించారు. ప్రతిరోజూ పాఠశాలలో జరిగిన విశేషాలను పిల్లలను అడిగి తెలుసుకోవాలని, నెలకు కనీసం ఒకసారి ఉపాధ్యాయులను కలిసి పిల్లల ప్రవర్తన, చదువుపై చర్చించాలని కోరారు. శనివారం నాటి 'నో బ్యాగ్ డే' కార్యకలాపాల్లో వారి భాగస్వామ్యాన్ని, కథల పుస్తకాలు చదివించడం ద్వారా వారిలో పఠనా నైపుణ్యాలను, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చారు. అలాగే పిల్లల స్నేహాలు, ఆరోగ్యం, మానసిక స్థితిపై నిరంతర పరిశీలన ఉండాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు మరియు భద్రతా సూచనలపై వారికి అవగాహన కల్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనని స్పష్టం చేశారు.

# 27 లక్షల విలువైన బంగారు ఆభరణాలు మల్లికార్జున స్వామి కి సమర్పించిన మాజీ మంత్రి శిద్దా

● శ్రీశైలం మల్లి కార్జున స్వామి సేవలో శిద్దా దంపతులు





**శ్రీశైలం,కలంకౌంటర్ :** శ్రీశైలం, కలంకౌంటర్, ప్రముఖ జ్యోతిర్లింగ క్షేత్రం శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామిని గురువారం మాజీ మంత్రి డా. శిద్దా రాఘవరావు దంపతులు దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు,అమ్మవారి కుంకుమ పూజలు నిర్వహించారు. దేవస్థానం అధికారులు, వేద పండితులతో కలసి శిద్దా రాఘవరావు దంపతులకు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు.

**అమ్మవారికి ఆషాడ సారె సమర్పించిన శిద్దా దంపతులు..** భ్రమరాంభ సమేత శ్రీ మల్లి కార్జున స్వామి వారి నిత్యాన్న దాన పథకానికి రూ 3 లక్షలు నగదు విరాళం మరియు అమ్మవారికి ఆషాడ సారె పునస్కరించు కొని భ్రమరాంభ అమ్మవారికి రూ 27 లక్షల విలువైన బంగారు గాజులు ఆలయ ఇ.ఓ ఎమ్.శ్రీనివాస రావు కు అందచేశారు. శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దర్శనం అనంతరం దేవస్థానం ఇ.ఓ ఎమ్.శ్రీనివాసరావు అర్చకులతో కలసి మాజీ మంత్రి శిద్దా రాఘవ రావు, లక్ష్మీ పద్మావతి దంపతులకు వేద ఆశీర్వచనం తో స్వామి వారి,తీర్ద ప్రసాదాలు,స్వామి వారి అమ్మవారి చిత్ర పటం,శేష వస్త్రాలు అందచేశారు.

# నేడు (ఈ నెల 24) పండగలా మెగా పీటీఎం 4.0

● విద్యార్థుల సమగ్రాభివృద్ధికి విలువైన వేదిక ● కార్యక్రమం విజయవంతానికి సమష్టి కృషి ● జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ, కలంకౌంటర్ :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపు, సమగ్రాభివృద్ధి, తల్లిదండ్రులు--ఉపాధ్యాయుల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ 4.0 కార్యక్రమాన్ని ఈ నెల 24న శుక్రవారం జిల్లా వ్యాప్తంగా పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలల్లో నమోదు శాతాన్ని పెంచడం, పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించడం, విద్యార్థుల వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించడం వంటివాటికి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో 691 ప్రాథమిక, 23 ప్రాథమికోన్నత, 208 ఉన్నత పాఠశాలలతో పాటు 10 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మెగా పీటీఎం నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులతో పాటు గౌరవ ప్రజాప్రతినిధులు, దాతలు, పూర్వ విద్యార్థులు కూడా కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ఇందులో ముఖ్యంగా విద్యార్థుల అభ్యసన ఫలితాలను విశ్లేషించడంతో పాటు పాఠశాలలో సౌకర్యాలు, పదో తరగతి ఫలితాలు, తల్లికి వందనం పథకం, షైనింగ్ స్టార్స్, ప్రాథమిక స్థాయిలోని జి-ఎఫ్ఎల్ఎన్ ఫలితాలు తదితర అంశాలు, పథకాలపై వివరించడం జరుగుతుందన్నారు.



**వారాహి నవరాత్రుల్లో భాగంగా పెనుగొండ శ్రీ వాసవి శాంతి ధామ్ క్షేత్రంలో 9 వ రోజు వారాహి అమ్మవారికి గాజులతో అలంకరణ.**

-వాసవి పెనుగొండ,కలంకౌంటర్ :

# వైభవంగా వారాహి నవరాత్రోత్సవాలు

● శాస్త్రోక్తంగా శ్రీ మృత్యుంజయ హోమం ● వారాహి మాతకు సారె ● అలరించిన భక్తి సంగీత కార్యక్రమం





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** స్థానిక అజాద్ రోడ్ లోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రీ వారాహి నవరాత్ర మహోత్సవాలలో భాగంగా 9వ రోజు రోజు గురువారం ఉదయం అపమృత్యు దోష పరిహారార్థం శ్రీ మృత్యుంజయ హోమం (బృహస్పతి హోమం) నిర్వహించారు. వారాహి అమ్మవారికి సామూహిక కుంకుమార్చన నీరాజన మంత్రపుష్పాలు తీర్థ ప్రసాద వినియోగం జరిగాయి. సాయంత్రం ఆషాడ మాసం సందర్భంగా వారాహిమాతకు మహిళలు సారే సమర్పించారు. ప్రముఖ సంగీత గాయని అల్లాడ శ్యామల ఆధ్వర్యంలో నిర్వహించిన భక్తి సంగీత కార్యక్రమం శ్రోతలను ఆధ్యాత్మిక సంద్రంలో ముంచెత్తింది. రాత్రి నీరాజన మంత్రపుష్పాలు, తీర్థప్రసాద వినియోగం జరిగాయి. పొక్కునూరి హరనాథ శర్మ అవధాని బ్రహ్మత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమాలలో అర్చకులు, భక్తులు పాల్గొన్నారు. ఆలయ పాలకవర్గ సభ్యులు మామిడి మురళీకృష్ణ, మోటమర్రి వెంకట బాబా ప్రసాద్,సామా వెంకటలక్ష్మీ కాంతారావు, బైసాని హయగ్రీవ రావు, ఉడత్తు శ్రీనివాసరావు పర్యవేక్షించారు.







# వైయస్ జగన్‌ను కలిసిన ఆర్‌డబ్ల్యూఎస్ కాంట్రాక్ట్ కార్మికుల యూనియన్



**తాడేపల్లి,కలంకౌంటర్ :** మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్‌ను గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల యూనియన్ ప్రతినిధులు గురువారం కలిశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయనను కలిసి తమ సమస్యలను వివరించారు. గత 26 ఏళ్లుగా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 7 వేల మంది కార్మికులు సమగ్ర మంచినీటి పథకాలలో పనిచేస్తున్నారని యూనియన్ ప్రతినిధులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు తాగునీరు అందించడంలో కీలకంగా పనిచేస్తున్నప్పటికీ తమకు ఉద్యోగ భద్రత, సకాలంలో వేతనాలు లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. థర్డ్ పార్టీ కాంట్రాక్ట్ విధానం కారణంగా అనేక జిల్లాల్లో కార్మికులకు చెల్లించాల్సిన ఎస్ఎస్ఆర్ రేట్లను తగ్గించి ఇస్తున్నారని వైయస్ జగన్ దృష్టికి తీసుకువచ్చారు. కొన్ని ప్రాంతాల్లో 10 నుంచి 20 నెలల వరకు వేతనాలు చెల్లించకపోవడంతో కార్మికుల కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని వాపోయారు. నెలల తరబడి జీతాలు అందకపోవడంతో కుటుంబ పోషణ, పిల్లల చదువులు, వైద్య ఖర్చులు భరించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. సంవత్సరాలుగా సేవలందిస్తున్న కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం అన్యాయమని పేర్కొన్నారు. థర్డ్ పార్టీ కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దు చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలను తక్షణమే చెల్లించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని యూనియన్ ప్రతినిధులు వైయస్ జగన్‌ను కోరారు. కార్మికులకు నిర్ణీత రేట్ల ప్రకారం వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. యూనియన్ ప్రతినిధులు వివరించిన సమస్యలను సావధానంగా విన్న వైయస్ జగన్ వారికి ధైర్యం చెప్పారు. ఆర్‌డబ్ల్యూఎస్ కాంట్రాక్ట్ కార్మికులకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వైయస్ జగన్ ను కలిసిన మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్, దేవినేని అవినాష్, మల్లాది విష్ణు, తన్నీరు నాగేశ్వరరావు తదితరులు.

# దేవాలయాలపై వరుస దాడులు ప్రజలు మర్చిపోలేదు..

● బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, పి. వి. ఫణి కుమార్, రామలింగేశ్వర స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు మెంబర్, నిమ్మగడ్డ శ్రీధర్ లు ఫైర్




**మచిలీపట్నం,కలంకౌంటర్ :** మచిలీపట్నం బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ కార్యాలయంలో పి. వి. ఫణి కుమార్, నిమ్మగడ్డ శ్రీధర్ లు గురువారం మాట్లాడుతూ. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో రాష్ట్రవ్యాప్తంగా హిందూ దేవాలయాలపై జరిగిన వరుస ఘటనలను ప్రజలు ఇంకా మరచిపోలేదని, ఇప్పుడు హిందూ ధర్మం పేరుతో రాజకీయాలు చేయడం వైఎస్సార్‌సీపీ నాయకులకు తగదని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్, పి. వి. ఫణి కుమార్, మచిలీపట్నంలో ప్రముఖ రామలింగేశ్వర స్వామి దేవాలయం ట్రస్ట్ బోర్డు మెంబర్, నిమ్మగడ్డ శ్రీధర్ లు తీవ్రస్థాయిలో విమర్శించారు. రామతీర్థంలోని శ్రీ కోదండరామాలయంలో శ్రీరాముడి విగ్రహం ధ్వంసం, అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ రథం అగ్నికి ఆహుతి కావడం, పిఠాపురంలోని పురాతన ఆలయాల్లో విగ్రహాలు, పాదుకలు ధ్వంసం కావడం, విజయవాడ శ్రీ కనకదుర్గమ్మ ఆలయం సమీపంలోని వినాయకస్వామి ఆలయంలో వెండి సింహాలు మాయమవడం, శ్రీకాకుళం జిల్లా మందస, పాతపట్నం ప్రాంతాల్లో గ్రామదేవతలు, ఆంజనేయస్వామి విగ్రహాల ధ్వంసం వంటి ఘటనలు వైఎస్సార్‌సీపీ పాలనలోనే చోటుచేసుకున్నాయని గుర్తు చేశారు. ఆ సమయంలో హిందూ సమాజం తీవ్ర ఆవేదన వ్యక్తం చేసినప్పటికీ, ఆలయాల భద్రత విషయంలో అప్పటి ప్రభుత్వం ఆశించిన స్థాయిలో స్పందించలేదని విమర్శించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తిరుపతిలో శ్రీ ఆంజనేయస్వామి విగ్రహం అపహరణకు గురైన ఘటనలో ప్రభుత్వం అత్యంత వేగంగా స్పందించిందని తెలిపారు. కేవలం 14 గంటల్లోనే పోలీసులు నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకుని, విగ్రహాన్ని స్వాధీనం చేసుకున్నారని చెప్పారు. హిందూ దేవాలయాలు, విగ్రహాల విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడమే కూటమి ప్రభుత్వ విధానమని స్పష్టం చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సనాతన ధర్మ పరిరక్షణపై స్పష్టమైన వైఖరితో ముందుకు సాగుతూ, హిందూ సంప్రదాయాలు, ఆలయాల గౌరవం కాపాడేందుకు నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రులు నారా లోకేష్, కొల్లు రవీంద్ర తదితరులు దేవాదాయ వ్యవస్థ బలోపేతం, ఆలయాల అభివృద్ధి, భక్తుల విశ్వాసాల పరిరక్షణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు పూర్తి మద్దతు అందిస్తున్నారని అన్నారు. "సనాతన ధర్మం, దేవాలయాల గౌరవం, హిందూ భక్తుల మనోభావాల పరిరక్షణ విషయంలో కూటమి ప్రభుత్వం ఎన్నటికీ రాజీపడదు.వాస్తవాలను వక్రీకరించి రాజకీయ లబ్ధి పొందాలనే ప్రయత్నాలు ఎప్పటికీ ఫలించవు" అని పి. వి. ఫణి కుమార్, నిమ్మగడ్డ శ్రీధర్ లు స్పష్టం చేశారు.

# ప్రతి తెలుగు హృదయాన్ని కలిపే సాంస్కృతిక ఉత్సవం "తెలుగు మహోత్సవం": మంత్రి కందుల దుర్గేష్

● జులై 25, 26 తేదీల్లో ఉండవల్లి గుహల వద్ద ఘనంగా వేడుకలు..తెలుగు భాషా వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పేలా మహోత్సవ నిర్వహణ ● సాంస్కృతిక సృజనాత్మక సమితి చైర్‌పర్సన్ పొడపాటి తేజస్వినితో కలిసి పోస్టర్ ఆవిష్కరణ ● మాతృభాషా పరిరక్షణకు యువత ముందుకు రావాలి..ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని మంత్రి దుర్గేష్ పిలుపు



**అమరావతి,కలంకౌంటర్ :** మాతృభాష వైభవాన్ని, సాంస్కృతిక సంపదను భావితరాలకు అందించాలనే ఉన్నతాశయంతో రాష్ట్రస్థాయిలో తెలుగు మహోత్సవం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.గురువారం సచివాలయంలో కేబినెట్ సమావేశం అనంతరం రాష్ట్ర సాంస్కృతిక, సృజనాత్మక సమితి చైర్‌పర్సన్ పొడపాటి తేజస్విని మంత్రి దుర్గేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జులై 25, 26 తేదీల్లో గుంటూరు జిల్లా మంగళగిరి సమీపంలోని చారిత్రాత్మక ఉండవల్లి గుహల ప్రాంగణంలో జరగనున్న తెలుగు మహోత్సవం అధికారిక పోస్టర్‌ను మంత్రి దుర్గేష్ చేతుల మీదుగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ .. తెలుగు భాషా వైభవం, సాహిత్య సంపద, సాంస్కృతిక సౌందర్యం, కళా సంప్రదాయాలు, జానపద వారసత్వం మరియు సృజనాత్మకతలను ఒకే వేదికపైకి తెచ్చే అద్భుతమైన వేడుక ఈ తెలుగు మహోత్సవం అన్నారు.మాతృభాషలోని మాధుర్యాన్ని విద్యార్థులు, యువతీ యువకులు ఆస్వాదించేలా, నిత్య జీవితంలో వాడుకలోకి తెచ్చేలా ప్రోత్సహించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం అని పేర్కొన్నారు.ఆధునిక పోకడల్లో తెలుగు భాషా స్వరూపం తగ్గుతోందనే ఆందోళనను అధిగమించి మాతృభాష గొప్పతనాన్ని విశ్వవిఖ్యాతం చేసేందుకు ఈ ఉత్సవం దోహదపడుతుందని ధీమా వ్యక్తం చేశారు.కార్యక్రమ వివరాలు వెల్లడిస్తున్న సమయంలో మంత్రి దుర్గేష్ సాహితీ సమరాంగ సార్వభౌముడు శ్రీకృష్ణదేవరాయలు రచించిన దేశభాషలందు తెలుగు లెస్స అన్న భావంతో కూడిన తెలుగ దేలయన్న దేశంబు తెలుగేను పద్యాన్ని స్వయంగా ఆలపించి, దాని తాత్పర్యాన్ని వివరించారు.మాతృభాష గొప్పతనాన్ని చాటిచెప్పే ఈ మహా కార్యంలో విద్యార్థులు, యువత, తెలుగు భాషాభిమానులు, ప్రతి ఒక్కరూ విశేష సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు.

Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com